గోపవరంలో విషాదం

నీటి తొట్టెలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - ముసునూరు

నీటి తొట్టెలో పడి బాలుడు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండలంలోని గోపవరం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన సురేష్, నాగశ్రీ దంపతులకు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో బాలుడు ఆదివారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఆడుకుంటూ ఇంట్లోని నీటి తొట్టెలో పడిపోయాడు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి తమ కుమారుడు కనిపించడంలేదని తల్లిదండ్రులు వెతకసాగారు. ఐదు గంటల సమయంలో ఇంట్లోని వరల తొట్టెలో చూడగా నీటిపై తేలియాడుతున్న బాలుని మృతదేహం కనిపించింది. దీంతో తల్లిదండ్రులు గుండులాలిసేలా రోదించారు. బాలుని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వైద్య ఆరోగ్య శాఖ..

రూటే వేరు..!

- డిప్యూటేషన్ల రద్దుకు హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాలు
- జిల్లా వైద్యఆరోగ్యశాఖలో అమలుకాని పరిస్థితి
- డిఎంహెచ్ఒ కార్యాలయంలోనే డిప్యూటేషన్లపై దాదాపు 20 మంది
- మెడికల్ ఆఫీసర్‌కు అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలా..?
- ఉన్నతాధికారుల ఆదేశాలపై లెక్కలేనితనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా వైద్యఆరోగ్యశాఖ రూటే వేరు అని మరోసారి రుజువైంది. ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం ఇక్కడ అమలుకాని పరిస్థితి ఉంది. 'మాకు నచ్చినట్టే చేస్తాం..ఎవరేం చెప్పినా డోంట్‌కేర్' అన్నట్లు ముందుకు సాగుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. వైద్యఆరోగ్య శాఖలో డిప్యూటేషన్లపై జిల్లావ్యాప్తంగా పని చేస్తున్న అధికారులు, సిబ్బందిని ఎవరి స్థానాలకు వారిని పంపించాలని, వెంటనే అందుకు సంబంధించిన చర్యలు చేపట్టాలని గత జనవరిలో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. జనవరి నెలాఖరున డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులు సైతం డిప్యూటేషన్లు రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే జిల్లాలో ఇప్పటి వరకూ డిప్యూటేషన్లపై ఎటువంటి చర్యలూ తీసుకోని పరిస్థితి కన్పిస్తోంది. వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన ఆదేశాల మేరకు తొలుత ప్రస్తుతం కొనసాగుతున్న డిప్యూటేషన్లను రద్దు చేయాల్సి ఉంది. ఏ అధికారినైనా డిప్యూటేషన్‌పై తెచ్చుకోవాలంటే సంబంధిత కారణాలను కూలంకుషంగా రాసి పంపించి రాష్ట్ర అధికారుల అనుమతి తీసుకోవాలని స్పష్టంగా పేర్కొంది. దీంతో ఏదైనా అవసరం ఉంటే అనుమతి తీసుకోవాలనే మాటను ఇక్కడి అధికారులు తమకు అనుకూలంగా మార్చుకుని, డిప్యూటేషన్లు రద్దు చేయకుండా ముందుకు సాగుతున్నారనే చర్చ ఆ శాఖలో కొనసాగుతోంది. ఈ శాఖలో పెద్దఎత్తున సిబ్బంది డిప్యూటేషన్లపై తమకు నచ్చిన చోట వేయించుకుని కొనసాగుతున్నారు. జిల్లా కేంద్రంలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలోనే దాదాపు 20 మంది డిప్యూటేషన్లపై కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఎటువంటి అవసరమూ లేకపోయినా డిప్యూటేషన్లపై చాలామంది ఉన్నట్లు సమాచారం. డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఎంపిహెచ్ఇఒలు ముగ్గురు, ఎంపిహెచ్ఎస్ ఒకరు, ఎంపిహెచ్ఎ ఎఫ్-1, సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురు, ఫార్మాసిస్టులు ఇద్దరు, మెడికల్ ఆఫీసర్లు ముగ్గురు, అటెండర్లు ముగ్గురు, ఎఫ్ఎన్ఒ ఒకరు, ఎంఎన్ఒ ఒకరు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఇద్దరు డిప్యూటేషన్లపై కొనసాగుతున్నట్లు

సమాచారం. డిప్యూటేషన్ల తతంగమంతా సొమ్ములతో నడుస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులకు సొమ్ము ముట్టజెప్పి పోస్టింగ్ ఇచ్చిన చోట చేయకుండా జిల్లా కేంద్రంలో ఉండిపోతున్నట్లు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా డిప్యూటేషన్లపై పని చేస్తున్న వారు పెద్దసంఖ్యలో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. సిబ్బంది కొరత ఉండి అవసరం ఉంటే రాష్ట్ర అధికారులకు తెలియజేసి నియమించుకోవచ్చు. జిల్లాలో మాత్రం అలా జరగడం లేదు. ఇష్టానుసారంగా డిప్యూటేషన్ల వ్యవహారం నడుస్తుందనే విమర్శలు ఉన్నాయి. దీనిలో డిఎంహెచ్ఒ కార్యాలయంలో కొంతమంది చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. కొంతమంది కింగ్‌మేకర్లుగా మారి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులను తప్పుదోవలో నడిపిస్తున్నారనే చర్చ సైతం నడుస్తోంది. జిల్లా వైద్యఆరోగ్యశాఖపై కలెక్టర్ దృష్టి సారిస్తే తప్ప సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అసలు ఆ శాఖలో ఏం జరుగుతుందనే చర్చ ప్రజల్లో నెలకొంది. వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్న వైద్యఆరోగ్యశాఖను కూటమి ప్రభుత్వంలోనైనా సరిదిద్దుతారో.. లేదో వేచిచూడాలి.

మెడికల్ ఆఫీసర్‌కు అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలా..!

ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రతి పిహెచ్‌సికి ఇద్దరు మెడికల్ ఆఫీసర్లను నియమించింది. ఒకరు ఆసుపత్రిలో రోగులను చూస్తే, మరొకరరు ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో పని చేయాల్సి ఉంటుంది. పిహెచ్‌సిలో మెరుగైన వైద్యసేవలకు అడ్డంకి సృష్టిస్తూ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లను డిఎంహెచ్ఒ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేయిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్లను అడ్మినిస్ట్రేటివ్ అధికారులుగా నియమిస్తున్న తీరు మరింత చర్చనీయాంశంగా మారింది. ఒక మెడికల్ ఆఫీసర్‌కు అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలు ఏవిధంగా అప్పగిస్తారో.. దాన్ని ఏవిధంగా సమర్థించుకుంటారో సదరు అధికారులే చెప్పాల్సి ఉంది. ఏదేమైనా వైద్య ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్ల వ్యవహారం వివాదస్పదంగా మారుతోంది. సమస్యను సరిచేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం డిప్యూటేషన్లను రద్దు చేసి, రాష్ట్ర ఉన్నతాధికారుల అనుమతితో ముందుకు సాగేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటారో, లేదో వేచిచూడాలి.

కొన్ని డిప్యూటేషన్లపై వరుస క్రమంలో చర్యలు

ఆర్.మాలిని, డిఎంహెచ్ఒ

డిప్యూటేషన్లకు సంబంధించి వరుస క్రమంలో కొన్ని చర్యలు తీసుకుంటున్నాం. అన్ని డిప్యూటేషన్లను రద్దు చేయాలని చెప్పలేదు. రాష్ట్రం నుంచి కొన్ని అనుమతి ఉన్నవి ఉన్నాయి. అంతేకాకుండా అవసరమైనచోట కొనసాగించవచ్చుకోవచ్చునన్నారు. అనవసరమైనవి ఉంటే పరిశీలించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొన్ని ఖాళీలు ఉన్నాయి. పనులు ఆగకుండా ముందుకు సాగడం కోసం నియమించుకోవడం జరిగింది. వచ్చే నెలలో కొంతమంది సిబ్బంది వస్తారని చెబుతున్నారు. వస్తే ఖాళీలు భర్తీ అవుతాయి. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అనుమతి తీసుకుని ఉంచుతాం. ఎవరైనా వస్తే రిలీవ్ చేస్తామని జిల్లా కలెక్టర్‌కు కూడా లెటర్ పెట్టి అనుమతి అడుగుతాం.

'ఇ-పంట' లో ముందంజ

- అందుబాటులో అన్నిరకాల ఎరువులు
- 9 విభాగాల్లో జిల్లా మంచి ప్రగతి
- డ్రోన్ల వినియోగంలో జిల్లాదే అగ్రస్థానం
- దెబ్బతిన్న పంటలకు వారం వ్యవధిలోనే రూ.14.44 కోట్లు పరిహారం జమ
- వ్యవసాయ శాఖ జెడి హబీబ్ భాషా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులకు నిరంతరం అండగా ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమాల అమల్లో, అన్నదాతకు అత్యంత ప్రాధాన్యమైన ఇ-పంట నమోదు 94 శాతం పూర్తి చేయడంలో జిల్లా వ్యవసాయశాఖ ముందంజలో ఉందని వ్యవసాయ శాఖ జెడి హబీబ్ భాషా తెలిపారు. రబీ సాగులో ఎరువుల నిల్వలు ఏవిధంగా ఉన్నాయి, రబీ సాగు ఏవిధంగా ముందుకు సాగుతోంది, వ్యవసాయంలో యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం ఎలా ఉంది, ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు సంబంధించిన పరిహారం రైతులకు అందిందా, కౌలురైతులకు రుణాల మంజూరు, భూసార పరీక్షలు వంటి వాటిలో పరిస్థితి ఎలా ఉందనే దానిపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో జెడి వివరించారు.

ప్రశ్న: జిల్లావ్యాప్తంగా రబీ సాగులో ఏయే పంటలు, ఎంతమేర సాగవుతున్నాయి?

జెడి: రబీలో జిల్లాలో ప్రధానమైన పంటలు రబీ, మొక్కజొన్న పొగాకుతోపాటు మినుము, పెసర, చెరకు, పత్తి, వేరుశెనగ వంటి పంటలు ఉన్నాయి. మొత్తం 1,83,191 ఎకరాల్లో రబీ సాగవుతోంది.

ప్రశ్న: ఇ-పంట నమోదుకు సంబంధించిన ప్రక్రియ ఏవిధంగా సాగుతోంది?

జెడి: రైతులకు రుణాల నుంచి ఏ ప్రభుత్వ పథకం అందాలన్నా ఇ-పంట తప్పనిసరి. జిల్లాలో ఇప్పటి వరకూ 1.70 లక్షల ఎకరాల్లో మొత్తంగా 94 శాతం ఇ-పంట నమోదు పూర్తి చేసి ముందంజలో ఉన్నాం. ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

ప్రశ్న: వ్యవసాయరంగంలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు జిల్లాలో ఏవిధంగా అమలవుతున్నాయి?

జెడి: రైతులకు అండగా నిలవడంలో ఏలూరు జిల్లా అనేక విభాగాల్లో ముందంజలో ఉంది. మొత్తం 12 విభాగాలకుగాను తొమ్మిది విభాగాల్లో మంచి ప్రగతిలో ఉన్నాం. 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలోనూ, పిఎం కిసాన్, పంట నష్టపరిహారం అందజేత, కౌలురైతులకు రుణాల పంపిణీ, భూసార పరీక్షలు నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం, ధాన్యం సేకరణ, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించడం, యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగంలోనూ జిల్లా ముందంజలో ఉంది.

ప్రశ్న: కౌలురైతులకు రుణాల పంపిణీ ఎంతమేర జరిగింది?

జెడి: కౌలు రైతులకు 65,147 కౌలు గుర్తింపు కార్డులు అందించడంతోపాటు రూ.142.85 కోట్లు ఇప్పటి వరకూ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాం. ఇంకా రుణాల మంజూరు కొనసాగుతోంది. పిఎం కిసాన్ కింద జిల్లాలో 1.32 లక్షల మంది రైతులకు రూ.27.04 కోట్లు పెట్టుబడి సాయం అందించడం జరుగుతోంది.

ప్రశ్న: ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందిందా?

జెడి: 2024 సెప్టెంబర్‌లో తుఫాను, వర్షాల వల్ల పంట నష్టం జరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేవలం వారం వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో పంట నష్టపరిహారం జమైంది. జిల్లాలో 11,782 మంది రైతులకు రూ.14.14 కోట్లు నష్టపరిహారం కింద రైతులకు అందింది.

ప్రశ్న: వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ టెక్నాలజీ వినియోగం, సమాచారం అందించడం జిల్లాలో ఏవిధంగా సాగుతోంది?

జెడి: వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంలో ఏలూరు జిల్లా అగ్రస్థానంలో ఉంది. జిల్లాకు 80 శాతం రాయితీపై అత్యధికంగా 40 డ్రోన్లు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిపి ఎన్‌పిఎస్ఎస్, ఎపిఎస్ఎస్ యాప్‌ల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందిస్తోంది. ఇందులో ఏలూరు జిల్లా అగ్రస్థానంలో ఉంది.

ప్రశ్న: భూసార పరీక్షలు ఎంతమేర జరిగాయి. రైతులకు పరీక్షా ఫలితాల వివరాలు అందించారా?

జెడి: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని ప్రభుత్వం ముందుకు సాగుతోంది. జిల్లాలో 22,400 మంది రైతులకు భూసార పరీక్షల పత్రాలు అందించి శాస్త్రీయంగా ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాం. అంతేకాకుండా రాష్ట్రంలోనే అత్యధికంగా 42,381 మంది రైతులు 40,875 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారు.

ప్రశ్న: ప్రస్తుత రబీలో ఎరువుల కొరత ఏమైనా ఉందా?

జెడి: రబీకి సంబంధించి ఇప్పటి వరకూ జిల్లాలో ఎటువంటి ఎరువుల కొరతా లేదు. మొత్తం రబీకి 1,40,374 మెట్రిక్ టన్నుల వరకూ ఎరువుల అవసరం ఉందని అంచనా. ఫిబ్రవరికి 33,517 మెట్రిక్ టన్నులు అవసరంగా తేల్చాం. ప్రస్తుతం మార్క్‌ఫెడ్, రైతుసేవా కేంద్రాలు, సహకార సంఘాలు, వ్యాపారులు, హోల్‌సేల్ వ్యాపారుల వద్ద మొత్తం 36,630 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. అవసరానికంటే దాదాపు మూడు వేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి. ఎరువులకు సంబంధించి ఏవిధమైన ఇబ్బందీ లేదు.

ప్రశ్న: రైతులకు ఇంకా ఏమైనా సేవలు అమలవుతున్నాయా?

జెడి: ప్రభుత్వం తెచ్చిన పాడి పంటలు మ్యాగ్‌జైన్ జిల్లాలో 6,795 టార్గెట్‌గా తీసుకోగా 6,154 సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. రైతులకు వ్యవసాయ సమాచారం నిరంతరం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ సర్వేలైన్స్ సిస్టమ్ అమలవుతోంది. ఇందులో ఇప్పటి వరకూ 520 రైతుసేవా కేంద్రాలకుగాను 411 చోట్ల దాదాపు 4,200 ఫొటోలు అప్‌లోడ్ జరిగింది. నేషనల్ పెట్ సర్వేలైన్ సిస్టమ్‌కు సంబంధించి 58 శాతం మంది రైతులు డౌన్‌లోడ్ చేసుకున్నారు.

మద్యం దుకాణాల లాటరీ వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక చలసాని గార్డెన్స్‌లో ఈ నెల 10వ తేదీన జరగాల్సిన మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో లాటరీ ప్రక్రియ వాయిదా వేశామని, దీన్ని సంబంధిత టెండరుదార్లు గమనించాలని విజ్ఞప్తి చేశారు. లాటరీ ప్రక్రియకు సంబంధించి తదుపరి షెడ్యూల్ రెండు, మూడు రోజుల్లో విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

ఏలూరులో 'తండేల్' సందడి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు అంబికా థియేటర్‌లో తండేల్ చిత్ర యూనిట్ ఆదివారం సందడి చేసింది. ఆ సినిమా విజయోత్సవంలో భాగంగా అంబికా థియేటర్‌కు విచ్చేసిన మాజీ ఎంఎల్‌ఎ అంబికా కృష్ణ సినీ హీరో అక్కినేని నాగచైతన్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అభిమానులనుద్దేశించి నాగచైతన్య మాట్లాడుతూ తండేల్ సినిమా కోసం నటించిన అందరూ కష్టాన్ని ఇష్టపడుతూ ముందుకు సాగారన్నారు. దానికి ప్రతిఫలంగా అభిమానుల ఆదరాభిమానాలు దక్కాయన్నారు. తండేల్ సినిమాను ప్రేక్షకులంతా థియేటర్లోనే చూసి ఆనందించాలని కోరారు.

మాట్లాడుతున్న నాగచైతన్య

అనంతరం అంబికా కృష్ణ మాట్లాడుతూ చిత్రం చాలా బాగుందని, నాగచైతన్య ఒక పెద్ద హీరో కొడుకు అనే గర్వం లేకుండా చాలా బాగా మాట్లాడారన్నారు. ఆయన తాత అక్కినేని నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునలా మంచి గుర్తింపు పొందాలన్నారు. అనంతరం అభిమానులు భారీ గజమాల వేశారు. ఈ కార్యక్రమంలో మూవీ డైరెక్టర్ చందు మొండేటి, ప్రొడ్యూసర్ బన్నీ వాసు, కమెడియన్ మహేష్ ఆచంట తదితరులు పాల్గొన్నారు.

కెఎస్.లక్ష్మణరావును గెలిపించేందుకు కృషి చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎంఎల్‌సి పట్టభద్రుల నియోజకవర్గానికి ఫిబ్రవరి 27వ తేదిన జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ బలపరచిన అభ్యర్థి ప్రస్తుత ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు విజయానికి కృషి చేయాలని ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కెఎస్.లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక సిఐటియు కార్యాలయంలో వివిధ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రిపుల్ ఐటీ, టీచర్స్, ఆర్‌టిసి, లాయర్లు, మున్సిపల్, అంగన్వాడీ, ఆశ, ఐద్వా, అనేక

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు

ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొని 27వ తేదీన జరిగే ఎన్నికల్లో నూజివీడు నియోజకవర్గ పరిధిలో అత్యధిక ఓట్లు పడేందుకు అవసరమైన ప్రచార ప్రణాళిక రూపొందించారు. సమావేశానికి హాజరైన నాయకులందరూ వారి వారి సంఘాల తరపున పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావుకు సంపూర్ణ మద్దతు తెలిపారు. సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ఆర్ హను మాన్లు, జి.రాజు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎంఎల్‌సి విశిష్టత, నిజాయితీ గురించి వివరించారు. నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు అండగా ఉన్నారని తెలిపారు.

వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి

ప్రజాశక్తి - చింతలపూడి

తూర్పు, పశ్చిమ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి అన్నారు. చింతలపూడి మండలంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ వీరరాఘవులు 40 ఏళ్లు ఉపాధ్యాయులుగా, పది సంవత్సరాలు యూట్యూబ్ మండల ప్రధాన కార్యదర్శిగా, 12 సంవత్సరాలు జిల్లా కార్యదర్శిగా, ఐదు సంవత్సరాలు జిల్లా అధ్యక్షులుగా, రెండు సంవత్సరాలు రాష్ట్ర కార్యదర్శిగా 2018 నుంచి ప్రస్తుతం వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెఎసి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో 35 ఏళ్లు యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘంలో వివిధ బాధ్యతలో పని చేశారని తెలిపారు. ప్రతి పోరాటంలో భాగస్వామి అయ్యారని, ఐక్య ఉద్యమాలకు నాయకత్వం వహించారని, అందరిలో ఒకటిగా మెలిగారన్నారు. పాలకులు ప్రశ్నించే గొంతుకులు నొక్కేస్తున్నారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రవి మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రాఘవులుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులును గెలిపించాలి

ప్రజాశక్తి - తణుకు

పేద, బడుగు బలహీన వర్గాల గొంతు విన్పించేందుకు పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విద్యావంతులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఆదివారం వివిధ సంస్థల్లోని గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థులకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. 2007లో పిడిఎఫ్ తరపున పోటీ చేసిన చుక్కా రామయ్య నుండి ప్రస్తుత సిట్టింగ్ ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, బి.గోపీమూర్తి, కెఎస్.లక్ష్మణరావు వరకు అంతా రాష్ట్రంలోని ఉద్యోగులు, కార్మికులు, పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువజనుల సమస్యలపై శాసనమండలిలో, బయట పోరాటం సాగించారని తెలిపారు. దిడ్ల వీర రాఘవులు ఇప్పటి వరకు ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారన్నారు. ప్రతి ఓటరూ సమస్యల పరిష్కారం కోసం పని చేసే పిడిఎఫ్ అభ్యర్థికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, రామకృష్ణ, శివకుమార్, శర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రతాప్

సుజుకి యాక్సెస్ కొత్త వాహనం విడుదల

ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సుజుకి యాక్సెస్‌లో కొత్త వేరియంట్ వాహనం ప్రయాణికులకు మరింత సౌలభ్యంగా అధిక మైలేజీలో అందుబాటులో ఉందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నగరంలోని ఓ హోటల్లో సుజుకి కంపెనీ యాక్సెస్ వేరియంట్లో కొత్త వాహనాన్ని విడుదల చేసింది. ఆ వాహనాన్ని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఎస్ఎంఆర్.పెదబాబు, ఆర్‌టిసి రీజియన్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు. తొలుత ఈ వాహనాన్ని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి వినియోగదారురాలికి అందజేశారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నూతన సుజుకి వాహనం మోడల్‌పరంగాను, మైలేజ్ పరంగాను కంపెనీ ఎంతో అద్భుతంగా డిజైన్ చేసిందన్నారు. నగరంలో ఉన్న శ్రీ కృష్ణ సుజుకి సంస్థ యజమాని నారా శేషుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సుజుకి సంస్థ యజమాని నారా శేషు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

మన్యం బంద్ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని చేసిన వ్యాఖ్యలపై నిరసనగా ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే 48 గంటల నిరవధిక రాష్ట్ర మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి కారం ధారయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని పూచిరాల గ్రామంలో ఆదివాసీ, గిరిజన, ప్రజా సంఘాల సమావేశం ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి మడకం ఏసుబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, గిరిజన ప్రజానీకానికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 11, 12 తేదీల్లో జరిగే బంద్‌లో మండలంలోని ఆదివాసీ, గిరిజన సంఘాలు, ఆదివాసీ ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, మండలంలో ఉన్న వ్యాపార, వర్తక, వాణిజ్య సంఘాలు సహకరించాలని, స్కూల్స్, కాలేజీలు, హోటల్స్ స్వచ్ఛందంగా మూసేసి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు, నాయకులు కారం వెంకట్రావు, గిరిజన సమాఖ్య మండలాధ్యక్షులు కట్టం వెంకటేశ్వర్లు, కంగాల గంగరాజు, ఆదివాసీ యువ చైతన్య సంఘం నాయకురాలు మడకం సునీత, రజిని పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :1/70 చట్టం, అటవీ హక్కుల చట్టాల్లో సవరణలు చేయాలంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో తలపెట్టిన మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఎపి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం అడ్డుగా ఉన్నాయని, వాటిని సవరించాలని స్పీకర్ వ్యాఖ్యానించడం, దారుణమని పేర్కొన్నారు. అయ్యన్నపాత్రుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే మన్యం బంద్‌లో ప్రజా సంఘాలు, ఆదివాసీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ముదినేపల్లిలో వేపుగా పెరిగిన మినుము పైరు

ఆశాజనకంగా మినుము పైరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఈ ఏడాది రబీలో సాగవుతున్న మినుము పైరు ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పైరు వేపుగా పెరిగి పూత, పిందె దశలో ఉంది. మండలవ్యాప్తంగా పెద్దఎత్తున రైతులు మినుము సాగు చేశారు. పలు గ్రామాల్లో పైరుపై బంగారు తీగ, ఆకుమచ్చ, బూడిద తెగులు, తలమాడు తెగుళ్ల వ్యాపించినట్లు రైతులు చెబుతున్నారు. అయితే రైతులు క్రిమిసంహారక మందులు అధికంగా వాడుతున్నారని, మినుము పైరును తరచూ తడపడం వల్ల తేమశాతం అధికమై దిగుబడులు తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు అంటున్నారు. అధికంగా క్రిమి సంహారక మందులు వాడడం వల్ల అధిక వ్యయం అవ్వడంతో పాటు దిగుబడులు తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా పైరును ఆశించిన తెగుళ్లకు తగు మోతాదులో మందులు పిచికారీ చేస్తే సరిపోతుందని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం పైరుకు అనుకూలంగా ఉండడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉండే అవకాశాలు ఉన్నాయని పలువురు కౌలురైతులు చెబుతున్నారు. పైరుపై తెగుళ్ల సోకడంతో ఇప్పటికే నాలుగుసార్లు పైరుపై తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఎకరాకు రూ.25 వేలు ఖర్చయినట్లు కౌలు రైతు పెందుర్తి వెంకట్రావు అన్నారు. పైరు తీతలు, నూర్పుడితో కలిసి ఎకరానికి రూ.40 వేల వరకు ఖర్చయ్యే పరిస్థితి ఉందని కౌలు రైతు వెంకట్రావు తెలిపారు. తలమాడు తెగులు అధికంగా ఉండడంతో దీని నివారణకు మందులు వాడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ తెగులు వల్ల పైరు ఎండిపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం మినుముకు గిట్టుబాటు ధర కల్పిస్తే తప్ప తాము ఈ కష్టాల నుంచి బయటపడేది లేదంటూ వెంకట్రావు తెలిపారు. నూర్పుడి వరకు మినుము ధరలు కూడా అనుకూలంగా ఉంటే తమ కష్టాలు తీరుతాయని కౌలు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నాటికలో ఓ సన్నివేశం

అలరించిన నాటిక మహోత్సవాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని కుమార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న నాటిక మహోత్సవాలు ఆదివారం రాత్రి అలరించాయి. నూజివీడు కళావేదిక, కళా విపంచి సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శించిన విడాకులు కావాలి సాంఘిక నాటిక నేటి సమాజంలోని కుటుంబాలకు అద్దం పట్టింది. నాటికలో నటించిన నటీనటుల హావభావాలు, హాస్య చలోక్తులకు ప్రేక్షకుల నుంచి కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి. పట్టణ ప్రజలు ఆనందంగా వీక్షించారు. రెండు రోజులపాటు నిర్వహించిన నాటిక మహోత్సవాల్లో కమనీయం సాంఘిక నాటిక, మరి అంత వద్దు సాంఘిక నాటిక, విడాకులు కావాలి సాంఘిక నాటిక, రైతే రాజు సాంఘిక నాటికలను ప్రేక్షకులు విశేషంగా ఆదరించారు. కళాకారులను ఘనంగా సన్మానించి అభిమానం చాటుకున్నారు. నిర్వాహకులు లయన్ పి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన నాటిక మహోత్సవాల్లో సాంఘిక నాటికాలు ప్రదర్శించడం అద్భుతంగా ఉందన్నారు. కుమార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధినేత పివి.కుమార్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంఎల్ఎ చింతమనేని

ఆపన్నులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

కష్టంలో ఉన్న ప్రతిఒక్కరికీ చింతమనేని గ్యారేజీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిఎస్‌సి ఉచిత మెగా శిక్షణ శిబిరం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఉదయం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో శిక్షణ పొందిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ దెందులూరు ఎంఎల్ఎ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహణలో తొలి రోజు నుంచి ఈ రోజు వరకు భాగస్వామ్యమైన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు ఇక్కడ శిక్షణ పొందిన ప్రతిఒక్కరూ మీ జీవితాల్లో విజయాన్ని సాధించి, ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. విద్య ఉపాధి అంశాల్లోనే కాకుండా దెందులూరు నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా వారికి అండగా నిలుస్తానని తెలిపారు. త్వరలోనే డిఎస్‌సి నోటిఫికేషన్ వస్తుందని, శిక్షణ పొందిన ప్రతిఒక్కరూ మంచి ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గ శాసనసభ ఎన్నికల పరిశీలకులు చెన్నుపాటి గాంధీ, శాసనమండలి ఎన్నికల పరిశీలకులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ టి.రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కనకపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న కొంతమంది అక్కడి నుంచి పరారవ్వగా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,300 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆరుగురిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

భార్యను వేధిస్తున్న భర్తతో పాటు అతనికి సహకరించిన మరో ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సకలాబత్తుల శ్రీను, ఉషారాణిలకు 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఈ నేపథ్యంలో ఇటీవల తన భర్త శ్రీను తనను అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా కుటుంబీకులతో కలిసి వేధిస్తున్నాడని అతని భార్య ఉషారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నివ్వెరపోయిన కొవ్వలి

జనార్ధన్‌రావు మృతితో గ్రామంలో విషాదఛాయలు

శోకసంద్రంలో సన్నిహితులు, గ్రామస్తులు



హైస్కూల్ వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆయన విరాళాలు ఇవ్వడంలో ముందుండే వ్యక్తి... ఎవరైనా ఆపదలో ఉన్నారంటే ఆదుకునే మనిషి... ఎంతోమంది విద్యార్థులను అక్కున చేర్చుకుని చదువులు చెప్పించే వ్యక్తి హత్యకు గురవ్వడంతో కొవ్వలి గ్రామం నివ్వెరపోయింది. ఆయన ద్వారా విరాళాలు పొందిన కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త జనార్ధన్‌రావు హత్యతో ఏలూరు నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

ప్రముఖ పారిశ్రామికవేత్త వెలమాటి చంద్రశేఖర జనార్ధన్‌రావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలు ఎవరికి వారు పలు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. హైదరాబాదులో జనార్ధన్‌రావు వెల్జాన్ గ్రూప్ అనే పేరుతో వ్యాపార సముదాయాన్ని ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగారు. 40 ఏళ్ల క్రితమే వీరు హైదరాబాద్ వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. అయితే జనార్ధన్‌రావు స్వగ్రామంపై మక్కువతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానికంగా కొవ్వలి జెడ్‌పి హైస్కూల్ అభివృద్ధికి దాదాపుగా రూ.3.50 కోట్లు విరాళంగా ఇచ్చారు. స్థానికంగా సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం నిర్మాణానికి నిధులు అందించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి కూడా కోట్లాది రూపాయల విరాళాలు ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయన చేసిన దానాలను, ఇచ్చిన విరాళాలను గొప్పంగా ఉంచుతారని తెలిపారు.

ఈ క్రమంలో ఇటీవల కాలంలో జనార్ధన్‌రావు ఆస్తి పంపకాలు చేశారు. అందులో భాగంగానే తన ముగ్గురు కుమార్తెల్లో పెద్ద కుమార్తె కుమారుడైన శ్రీకృష్ణను వెల్జాన్ సంస్థలకు డైరెక్టర్‌గా నియమించారు. రెండో కుమార్తె సరోజినీదేవి కుమారుడు కీర్తితేజ పేరుపై రూ.నాలుగు కోట్ల షేర్లను బదిలీ చేశాడు. దీంతో సంతృప్తి చెందని కీర్తితేజ తాతపై ఘర్షణకు దిగాడు. అంతటితో ఆగకుండా పథకం ప్రకారం తల్లితో కలిసి ఆయనను కలిసేందుకు వెళ్లాడు. అక్కడ ఘర్షణ పడుతున్నట్లు నటించి అప్పటికే తనతో తెచ్చుకున్న కత్తితో తాతపై పాశవికంగా 50 కత్తిపోట్లు పొడి చాడు. అడ్డు వచ్చిన తన తల్లిపై కూడా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. వీరిపై దాడి చేసిన అనంతరం అతను ఘటన స్థలం నుంచి పరారయ్యాడు. పోలీసులు అతడిని హైదరాబాద్‌లోనే అరెస్టు చేశారు.

జనార్ధన్‌రావుకు సొంత ఊరిపై మమకారం పోలేదని, ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు కుటుంబ సభ్యులతో కొవ్వలి గ్రామానికి వస్తారని ఆయన సన్నిహితులు, గ్రామస్తులు తెలుపుతున్నారు. మహా కుంభమేళాకు వెళ్లి వచ్చిన తర్వాత కొవ్వలి గ్రామానికి వచ్చి అందరిని కలుస్తానని తెలిపినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ లోపు ఇలా జరిగిందని గ్రామస్తులు, సన్నిహితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. జనార్ధన్‌రావుకు నివాళులర్పిస్తూ జెడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో సిబ్బంది, విద్యార్థులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

రఘురామకు దళితులంటే చిన్నచూపు తగదు

దళిత సంఘాల జెఎసి నేతలు

ఏలూరు సిటీ : బాధ్యతగల పదవిలో ఉన్న ఎపి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు దళితులంటే చులకన అని దళిత సంఘాల జెఎసి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరులోని ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న లేడీస్ లయన్స్ క్లబ్‌లో దళిత జెఎసి నాయకులు ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ సంజీవ్ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడులో చెరువుల అక్రమణ తొలగించడంతో నిరాశ్రయులైన దళితులు, బడుగు బలహీన తరగతుల వారిని పరామర్శించేందుకు ఎయిమ్ నాయకులు వెళ్తే వారు విద్వేషాలను రెచ్చగొట్టేందుకు వచ్చారని తప్పుడు ప్రచారాలు చేశారన్నారు. ఈ తప్పుడు ప్రచారాలను ఖండిస్తున్నట్లు చెప్పారు. ఆక్రమణల తొలగింపు బాధితులను పరామర్శించేందుకు ఎయిమ్ నాయకులు వెళ్తే తప్పేంటని ప్రశ్నించారు. ఎయిమ్ స్టిక్కర్లు ఉన్న వాహనంలో దళిత నేతలు అక్కడకు వెళ్లడం నేరమెలా అవుతుందని ధ్వజమెత్తారు. రఘురామకృష్ణంరాజు తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి సీనియర్ ఐపిఎస్ అధికారి పివి.సునీల్‌కుమార్‌పై అవాక్కులు చవాక్కులు మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి దానిని సునీల్‌కుమార్‌కు ఆపాదించడం రఘురామకృష్ణంరాజుకు అలవాటైపోయిందని ధ్వజమెత్తారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న సునీల్‌కుమార్‌పై, దళిత సమస్యలపై పోరాటం సాగిస్తున్న ఎయిమ్‌పై రఘురామకృష్ణంరాజుకు ఎందుకంత అక్కసు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని రఘురామకృష్ణంరాజు డిమాండ్ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. బాధ్యతగల పదవిలో ఉండి ఇష్టం వచ్చినట్లుగా ఆయన నోరు పారేసుకోవడం చూస్తుంటే అధికారం ఉందని రెచ్చిపోతున్నట్లుగా కనిపిస్తుందన్నారు. సిఎం చంద్రబాబు, ఎన్‌డిఎ ప్రభుత్వం అండదండలున్నాయని అవాక్కులు, చవాక్కులు మాట్లాడుతున్నట్లుగా ఉందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎయిమ్‌పై అక్కసు కనబరుస్తూ నేతలపై కేసులు పెట్టించి వాస్తవాలు వక్రీకరించడం సరికాదన్నారు. పివి.సునీల్‌కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న రఘురామకృష్ణంరాజు అధికారం చెలాయిస్తుండడాన్ని అందరూ గమనిస్తున్నారన్నారు. గతంలో అంబేద్కర్ ఫ్లెక్సీని చించివేసినప్పుడు రఘురామకృష్ణంరాజుపై చట్టప్రకారం చర్యలు తీసుకోకుండా ప్రభుత్వంలో ఆయన భాగస్వామిగా ఉన్నారని వదిలేశారని గుర్తు చేసారు. అధికారం ఉందని దళితులపై తప్పుడు కేసులు పెట్టిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. తాటాకు చప్పుళ్లకు సునీల్‌కుమార్, ఎయిమ్ నాయకులు భయపడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్, మాల సంఘాల జెఎసి నాయకులు, ఎయిమ్ జిల్లా ప్రెసిడెంట్ వాసే ఆనంద్, డాక్టర్ మిండెం సంతోష్, అంబటి నాగేంద్రప్రసాద్, సత్యం మాస్టర్, పాము మనిసింగ్, బంటుమిల్లి హరికృష్ణ, నూకపెయ్యి కార్తీక్, మాంద్రు లాజర్, నేతల రమేష్ బాబు, ఎయిమ్ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2003 డిఎస్‌సి అభ్యర్థులకు

పాత పెన్షన్ విధానం అవకాశం కల్పించాలి

కృష్ణ, గుంటూరు జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

2003 డిఎస్‌సి అభ్యర్థులకు తప్పనిసరిగా పాత పెన్షన్ విధానాన్ని అవకాశం కల్పించాలని, కృష్ణ, గుంటూరు జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. గుంటూరు జిల్లా ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్లో డిఎస్‌సి 2003 టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మోపిదేవి శివశంకరరావు అధ్యక్షతన 2003 ఉపాధ్యాయుల సమస్యపై ఆదివారం సమావేశం జరిగింది. సుమారు 500 మందికి పైగా డిఎస్‌సి 2003 అభ్యర్థులు పాల్గొన్న ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ప్రాతినిధ్యం వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 57 ప్రకారం 2003 డిఎస్‌సి అభ్యర్థులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ కార్యదర్శి జానకిని కలిసి 2003 అభ్యర్థుల పాత పెన్షన్ అమలు చేయాలని కోరామన్నారు. ఒపిఎస్ విధానం వచ్చేవరకు పోరాటంలో భాగస్వామ్యం అవుతామని, ఉద్యమాల్లో సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన తెలిపారు. రేపు రాబోయే శాసనమండలి సమావేశాల్లో ప్రస్తావన తెస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలుగుదేశం ప్రభుత్వ విప్ ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర కార్యాలయం ఇన్‌ఛార్జి ఎంఎల్‌సి పరుచూరి అశోక్‌బాబు, కృష్ణ గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంఎల్‌సి ఎఎస్.రామకృష్ణ, తదితరులు పాల్గొని ప్రసంగించారు. 11 వేల మందికి పైగా పాత పెన్షన్ ఇవ్వాల్సి ఉన్నా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ, ఫోరం కన్వీనర్ ఎం.గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

నేడు గుంటూరులో నామినేషన్

కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు సోమవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఉదయం పది గంటలకు స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభలో పాల్గొని అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో టీచర్లు, గ్రాడ్యుయేట్ల సమస్యలపై ప్రాతినిధ్యం కోసం ఏర్పాటు చేసిన టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానాల్లోనూ రాజకీయ పార్టీలు నేరుగా పోటీ చేస్తున్నాయని ఈ సందర్భంగా లక్ష్మణరావు అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలకు మండలిలో గొంతుకగా ఉంటానని, తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఇతర ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు



ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆదర్శవంతమైన సేవలను విస్తృతం చేయాలంటూ తానిచ్చిన పిలుపును స్ఫూర్తిమంత్రంలా ధ్వనింపచేస్తూ, అవసరమైన సేవలను స్ఫూర్తివంతంగా అందిస్తున్న ప్రతిఒక్కరినీ అభినందిస్తున్నట్లు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు ఆర్ఆర్ పేటలోని సరస్వతి హాస్పిటల్ మల్టీ స్పెషాలిటీ, ట్రామాకేర్ సెంటర్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ప్రారంభించి 50 రోజులు పూర్తైన సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ప్రారంభించారు. తొలుత ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎంఎల్ఎ చంటికి ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు అక్కెం నరేష్, డాక్టర్ దాకారపు సాయిదీప్తిలు శిబిరానికి విచ్చేసిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే అవసరమైనవారికి శస్త్ర చికిత్సలను సైతం ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ సేవ అనేది స్ఫూర్తిమంత్రంలా ధ్వనిస్తోందన్నారు. వైద్య శిబిరంలో అవసరమైనవారికి శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేయాలనే ఆలోచన చేయడం అత్యంత ఆదర్శనీయమని ఆయన ప్రశంసించారు. అనంతరం ఎంఎల్ఎ చంటిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు మామిళ్లపల్లి పార్థసారథి, ఎంఆర్‌డి.బలరాం, వందనాల శ్రీనివాస్, ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుక్కునూరులో..

500 మందికిపైగా ఉచిత వైద్య పరీక్షలు

కుక్కునూరు : స్థానిక కుక్కునూరు మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ సమీపంలో భద్రాచలం హాస్పిటల్ డాక్టర్లు పవన్‌రెడ్డి (జనరల్, షుగర్ వ్యాధి వైద్య సేవలు), గీతా పావని (కిడ్నీ కేర్, డయాలసిస్)లు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి కుక్కునూరు మండలం మారుమూల ప్రాంతాల నుంచి సుమారు 500 మందికి పైగా వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ పవన్‌రెడ్డి మాట్లాడుతూ షుగర్ వ్యాధిని ముందు గుర్తించకపోవడం వల్ల కిడ్నీలు పాడైపోయే అవకాశం ఉందన్నారు. షుగర్ వ్యాధి గురించి ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు స్థానిక సర్పంచి రావు మీనా వినోద్ చేతులమీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచితంగా వైద్యం అందించి మందులు అందించిన డాక్టర్లకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సభ్యులు

బాధితుడికి మానవత సాయం

ప్రజాశక్తి - పోలవరం

పక్షవాతం బారిన పడి అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న బాధితునికి పోలవరం మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఆదివారం ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వం చాటుకున్నారు. పోలవరం పంచాయతీ నూతనగూడెం గ్రామానికి చెందిన సింగిరెడ్డి పోశీరావు అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధ పడుతున్నాడు. ఎలాంటి ఉపాధి లేక అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు చిలకా రాంబాబు, పోతుల చిరంజీవి, ఆకుల నరసింహమూర్తి, సుందర సత్యనారాయణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర పర్యటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజల సంక్షేమానికి టిడిపి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఏలూరు పర్యటనలో భాగంగా జనసేన ఏలూరు నియోజకవర్గ కార్యాలయాన్ని ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఆహ్వానం మేరకు సందర్శించారు. ఆయనకు జనసైనికులు, వీర మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని అఖండ మెజార్టీతో గెలిపించి, కూటమి ప్రభుత్వానికి విజయాన్ని అందించాలన్నారు. తద్వారా రాష్ట్రంలో నిరుద్యోగులకు, ఉపాధి కల్పనకు, తోడ్పాటు జరుగుతుందన్నారు. గత ఐదేళ్లల్లో వైసిపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రాన్ని ఏ విధంగా నాశనం చేసిందో ప్రజలంతా చూశారన్నారు. అటువంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలంటే ఉభయగోదావరి జిల్లాల ప్రజలు కూటమి బలపరిచిన ఎంఎల్‌సి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పట్టభద్రులు ఈ ఎన్నికలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు 48 గంటల్లో బకాయిలను చెల్లిస్తున్నట్లు చెప్పారు. పర్యాటక రంగం సైతం అభివృద్ధి చెందుతుందని, ప్రతి గ్రామంలో పంచాయతీ, పంచాయతీరాజ్ విధులను సక్రమంగా జరిగేలాగా, అటవీ ప్రాంతాల్లో రోడ్ల మార్గం, విద్యుత్ సదుపాయాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను కుల్లగొట్టి చిల్లిగవ్వ లేకుండా చేసినప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 రోజుల్లోనే మూడు వేల పెన్షన్‌ను రూ.నాలుగు వేలుకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. గత ప్రభుత్వంలో 2000 నుంచి 3000 వరకు పెన్షన్ పెంచడానికి వైసిపి ప్రభుత్వానికి ఐదేళ్ల పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన సీనియర్ నాయకులు నారా శేషు, జిల్లా ఎన్నికల కన్వీనర్ రాఘవయ్య చౌదరి, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

మద్యం షాపుల డ్రా వాయిదా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఏలూరు నగరంలోని చలసాని గార్డెన్స్‌లో జరగాల్సిన కల్లుగీత కార్మికుల మద్యం షాపుల డ్రా వాయిదా పడినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నూజివీడులో ఆయన ఆదివారం మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నుంచి అనుమతి లభించిన తరువాత డ్రా తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ విషయం కల్లుగీత కార్మికులు గమనించాలని సూచించారు. ఉన్నతాధికారులు ప్రకటించే తదుపరి తేదీలను అనుసరించి డ్రా కొనసాగుతుందన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు రాజు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రాంతంలో ఉన్న బొగ్గు నిల్వలను వెలికి తీసి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర మహాసభలో తీర్మానించినట్లు ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు తొర్లపాటి రాజు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభ జరిగినట్లు తెలిపారు. ఈ మహాసభలో ఏలూరు జిల్లాలో ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం చింతలపూడి ప్రాంతంలో బొగ్గు నిల్వలను వెలికి తీయాలని, అక్కడ బొగ్గు వెలికితీత కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఏలూరులో మూతపడిన జ్యూట్ మిల్లుల స్థానంలో ప్రభుత్వ రంగ పరిశ్రమ ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎఐవైఎఫ్ ఏలూరు జిల్లా కో-కన్వీనర్‌గా ఉన్న తనను రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. చింతలపూడి ప్రాంతం నుంచి ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నికైన తొర్లపాటి రాజును ఎఐవైఎఫ్ చింతలపూడి నియోజకవర్గ నాయకులు ఖమ్మం ప్రసన్నకుమార్, వడ్డే రామారావు, పండగ శేఖర్, పిట్ట టైని డోల రాజేష్, టి.అంబేద్కర్ అభినందించారు.

రాజశేఖరం గెలుపునకు కృషి చేయాలి

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 27న జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు కోరారు. నారాయణపురంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, బిజెపి జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, ఎంఎల్‌సి ఎన్నికల ఉంగుటూరు నియోజకవర్గ పరిశీలకుడు వి.సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి : పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో రాజశేఖరం గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం మండల బూత్ ఇన్‌ఛార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, కూటమి నాయకులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సోమవారం ఉదయం ఏలూరులో జరిగే నామినేషన్ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎంఎల్‌సి పట్టభద్రుల ఓటర్లను చేర్చడంలో జిల్లాలో ముందంజలో ఉన్నామని, ఓటింగ్ వేయించడంలో కూడా జిల్లాలో ముందంజలో ఉండే విధంగా సమన్వయంతో కృషి చేయాలని చెప్పారు.

దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బాలుర హై స్కూల్ ఆవరణలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ప్రవేశిక, ప్రవీణ, విశారద, మధ్యమా, రాష్ట్ర భాష వంటి పరీక్షలకు 237 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. పగడ్బందీ ఏర్పాట్లు చేశారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టామని వివరించారు.

CHANGE OF NAME

I **SWATHI YENUMULA**, W/o. **YENUMULA MOHINDAR NAG** Resident of D.No.4-98/C, Bantty recidence Dum Dum gardens, Nuzvid town, Eluru District, A .P. I have changed my name **SWATHI YANUMULA** (old) to **SWATHI YENUMULA** (new) hance forth I am being called **SWATHI YENUMULA,** W/o **YENUMULA MOHINDAR NAG** in all purpose.

CHANGE OF NAME

I **YENUMULA MOHINDAR NAG** D.No 4-98/c Bantty recidence Dum Dum gardens, Nuzvid Town, Eluru District, A.P. I changed my Name **YENUMULA MOHINDRA NAG** (old Name) to **YENUMULA MOHINDAR NAG** (NewName) hance forth I am being called **YENUMULA MOHINDAR NAG** for all purpose.